
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 17 ఆగస్టు 2025

వేతన వెతలు



అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం ఇస్తున్న రిసోర్స్ పర్సన్స్

- ఐదు నెలలుగా నిలిచిన జీతాలు
- ఇబ్బందులు పడుతున్న మెప్మా రిసోర్స్ పర్సన్స్
- జిల్లాలో 173 మంది మెప్మా ఆర్పీలు

జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తూ మున్సిపాలిటీల పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల పొదుపు లెక్కా పద్దులు, బ్యాంకు రుణాలు ఇప్పించే బాధ్యతలు చూసే ఆర్పీ (రిసోర్స్ పర్సన్)లకు వేతన వెతలు తప్పడం లేదు. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళా సంఘలా బాధ్యతలతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాలు పంచుకునే ఆర్పీలకు చాలీచాలని వేతనం ఇస్తున్నారు. ఇది కూడా సకాలంలో అందించడం లేదు. జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న 173 మంది ఆర్పీలు వేతనాల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

నెలకు 600 నుంచి పని చేస్తున్న ఆర్పీలు..

రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం మెప్మా ఆర్పీలకు నెలకు 600 పారితోషకం అందించేది. ఆ తర్వాత ఆ పారితోష కాన్ని వెయ్యికి, తరువాత రెండు వేలకు పెంచుతూ వచ్చింది. 2018 నుంచి ఆర్పీలకు నెలకు రూ. 4 వేల వేతనం, పట్టణ సమాఖ్య నుంచి మరో రూ.2 వేలు కలిపి రూ. 6 వేల చొప్పున స్త్రీ నిధి ద్వారా చెల్లిస్తున్నారు. ఇచ్చే తక్కువ వేతనం కూడా ప్రభుత్వం ఇవ్వకుండా స్త్రీ నిధి ద్వారా పారితోషకం పేరుతో ఇవ్వడాన్ని పలువురు ఆర్పీలు వ్యతిరేకిస్తున్నారు. గత బీఆర్ఎస్ పాలనలో అనేక పర్యాయాలు మంత్రులు, కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హైదబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నా చేసినా వారి సమస్య పరిష్కారం కాలేదు.

ఐదు నెలలుగా ఎదురుచూపులు

మెప్మా రిసోర్స్‌పర్సన్‌లు ఐదు నెలలుగా వేతనాల కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవల అదనపు కలెక్టర్ బీఎస్ లత, మెప్మా ఏఓ దుర్గపు శ్రీనివాస్ గౌడ్‌లకు మెప్మా రిసోర్స్ పర్సన్‌లు వినతిపత్రం అందించారు. ప్రస్తుత యేడాది మార్చి, ఏప్రిల్, మే, జూన్, జూలై మాసాలకు చెందిన వేతనాలు అందించాలని కోరారు. వెంటనే గౌరవ వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అదనపు బాధ్యతలతో సతమతం

మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న మెప్మా ఆర్పీలకు అదనపు బాధ్యతలు భారంగా మారుతున్నాయి. పట్టణాల్లో స్వయం సహాయక మహిళా సంఘాల ఏర్పాటు, వాటి బలోపేతం, రుణాలు ఇప్పించడం, నిర్ణీత గడువుల్లో మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించి పలు తీర్మానాలు చేయిస్తుంటారు. వీధి వ్యాపారులను గుర్తించడం, గుర్తింపు కార్డులు అందించడం, బ్యాంక్ రుణాలు అందేలా సహకరించడం వంటి విధులను నిర్వహిస్తున్నారు. పట్టణాల్లో ఇతర వ్యాపారాలు చేసుకునే వ్యక్తులకు ముద్ర రుణాలు ఇప్పించడం, తదితర కార్యక్రమాలను

మిగతా 8లో

జిల్లాలో పనిచేస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్స్

మున్సిపాలిటీ	ఆర్పీల సంఖ్య
జగిత్యాల	61
కోరుట	50
మెట్‌పల్లి	34
రాయికల్	16
ధర్మపురి	12
మొత్తం	173

సమస్య పరిష్కరించాలి



ప్రభుత్వం మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు ప్రతీ నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలి. అరకొరగా ఇస్తున్న గౌరవ వేతనాలు సైతం ఎప్పటికప్పుడు అందించక పోవడంతో ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొంటున్నాం. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు అందించాలి.

రమ, జిల్లా మెప్మా రిసోర్స్ పర్సన్స్ సంఘం అధ్యక్షురాలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మెపాలో పనిచేస్తున్న ఆర్పీల ఐదు నెలల వేతన బకాయిలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లాం. సమస్యను పరిష్కరించడానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే మహిళా స్వయం సహాయక సంఘాల సమాఖ్యల ఖాతాల్లో జమ చేస్తాం. ఆయా ఖాతాల నుంచి ఆర్పీలు వేతనాలు అందుకోవాల్సి ఉంటుంది.

దుర్గపు శ్రీనివాస్ గౌడ్, మెప్మా పరిపాలన అధికారి

ఎమ్మెల్యేను కలిసిన సహకార సంఘాల అధ్యక్షులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల పదవీ కాలాన్ని ఆరు నెలలు పొడిగించినందుకు గాను జగిత్యాల నియోజకవర్గంలోని సహకార సంఘాల అధ్యక్షులు శనివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఈ సందర్భంగా సహకార సంఘాల అధ్యక్షులు తమ పదవీ కాలాన్ని ఆరు పొడిగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా సభ్యులు ముప్పాల రాంచంద్ర రావు, నియోజక వర్గంలోని ప్యాక్స్ చైర్మన్‌లు ఏనుగు మల్లారెడ్డి, ధీటి రాజిరెడ్డి, నరసింహా రెడ్డి, గురునాథం, మల్లారెడ్డి, రాజలింగం, ముత్యంరెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని భవాని నగర్‌కు చెందిన దాస శ్రీనివాస్‌కు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరు అయిన 60 వేల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడువాల లక్ష్మణ్ నక్కల రవీందర్ రెడ్డి, క్యాదాసు నవీన్, శ్రీరాం బిక్షపతి, యవ్వనం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేత

పెగడపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని దోమలకుంట ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన గాదర్ల రమేష్ కంప్యూటర్, ప్రొజెక్టర్‌ను బహూకరించారు. గ్రామానికి చెందిన రమేష్ దుబాయిలో స్థిర నివాసం ఉంటూ తాను పుట్టి పెరిగిన ఊరు మీద మమకారంతో విద్యార్థులకు మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి కంప్యూటర్ విద్యను అందించాలనే లక్ష్యంతో కంప్యూటర్, ప్రొజెక్టర్‌ను కొనుగోలు చేశారు. ఈ మేరకు రమేష్ తండ్రి శంకరయ్య పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గాలి నాగరాజు యాదవ్‌కు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవయ్య, ప్రవీణ్, శ్రీధర్ గౌడ్, మమత, లత, పాఠశాల చైర్మన్ లత, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణకు ప్రభుత్వం కృషి

-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

భీమారం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. భీమారం మండలంలోని దేశాయిపేటరెడ్డి సంఘ భవనంలో శనివారం మేడిపల్లి, భీమారం మండలాల్లో అర్హులైన 46 మంది లబ్ధిదారులకు రూ.15 లక్షల 2 వేల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాయిపేట గ్రామంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. రైతుల కోసం ఎరువుల గోదాములను మంజూరు చేశామని, పనులు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మెడికల్ హబ్‌గా మారిందన్నారు. అనంతరం వెంకట్రావుపేట తాజా మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్ జిర్ఫ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా చేపట్టే కార్యక్రమాలకుగాను ఇటీవల అమెరికాలోని టొలాసో మెక్సికో యూనివర్సిటీ వారు అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డును ఎంపిక చేయడం పట్ల వారిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేసుకుంటూ ముందుకు పోవాలని సూచించారు.

జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణం

-కాలనీవాసుల ఆందోళన

జగిత్యాల అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఏడో వార్డులో జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణం చేపట్టారు. సెల్ టవర్ నిర్మాణం వల్ల పసిపిల్లలకు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని కాలనీ వాసులు ఆందోళన నిర్వహించారు. ట్రాయ్ నిబంధలనకు విరుద్ధంగా సెల్ టవర్ నిర్మాణం సాగిస్తున్నారని, దాని వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సెల్‌టవర్ ఏర్పాటును నిలిపివేయాలని కాలనీ వాసులు గతంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అయినప్పటికీ నిర్మాణం ఆపడం లేదంటూ రాత్రి వేళలో పనులు నిర్వహిస్తున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్‌తో ఓటర్‌కార్డు లింక్ చేయాలి

-ఎన్నికల కమిషన్‌కు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డుతో ఓటరుకార్డును లింక్ చేయాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. బీహార్ రాష్ట్రానికి సంబంధించి గుర్తించిన 11 కార్డుల ఓటరు గుర్తింపు కార్డుల జాబితాలో ఆధార్‌కార్డు చేర్చకపోవడం పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా అడ్డుకోవడమేనని ఆయన ఆరోపించారు. బీహార్ రాష్ట్రంలో 65 లక్షల ఓటర్ల పేర్లు తొలగించడం భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కును కాలరాయడమేనని అన్నారు. ఈ నేపథ్యంలో భారత అత్యున్నత న్యాయవ్యవస్థ బీహార్ రాష్ట్రంలో ఆధార్ కార్డు పరిగణనలోకి తీసుకునే విధంగా తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయమని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు.

జిల్లాలో భారీ వర్షం



ధర్మపురి మండలం ఆకుసాయిపల్లి వద్ద నీట మునిగిన లోలెవల్ వంతెన

- జలమయమైన రహదారులు
- నీట మునిగిన ఆకుసాయిపల్లి వంతెన
- జగిత్యాల-మంచిర్యాల మార్గంలో రాకపోకలకు అంతరాయం

జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు సగటున 30.9 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లుగా రికార్డు నమోదైంది. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యధికంగా ధర్మపురి మండలం నేరేళ్లలో 61.3 మిల్లీమీటర్లు కురిసింది. ధర్మపురి మండలం బుద్దేశ్ పల్లిలో 57.3 మిల్లీమీటర్లు, గొల్లపల్లిలో 13.3 మిల్లీమీటరు, అత్యల్పంగా పెగడపల్లిలో 10.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

మేడిపల్లిలో 47.3 ఎంఎం, వెల్గటూరులో 44.0 ఎంఎం, సారంగపూర్‌లో 43.5 రాయికల్ మండలం అల్లీపూర్‌లో 41.8 ఎంఎం, కోరుట్లలో 39.3 ఎంఎం, బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 37.8 ఎంఎం, బుగ్గారం మండలం సిరికొండలో 34.3 ఎంఎం, రాయికల్‌లో 31.8 ఎంఎం, మెట్‌పల్లిలో 31.0 ఎంఎం, ధర్మపురి మండలం జైనాలో 30.8 ఎంఎం, కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 28.5 ఎంఎం, జగిత్యాలలో 26.8 ఎంఎం, ఇబ్రహీంపట్నం మండలం గోదూరులో 25.0 ఎంఎం, మల్యాల మండలం మద్దుట్లలో 24.0 ఎంఎం, కథలాపూర్‌లో 23.3 ఎంఎం, భీమారం మండలం గోవిందారంలో 22.8 ఎంఎం, కొడిమ్యాల మండలం పూడూరులో 21.8 ఎంఎం, మల్లాపూర్‌లో 18.3 ఎంఎం, గొల్లపల్లిలో 13.3 ఎంఎం, పెగడ పల్లిలో 10.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.



యామాపూర్-ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య తాత్కాలిక రోడ్డు పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

పలు ప్రాంతాల్లో కూలిన ఇళ్లు

జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షం వల్ల జన జీవనం స్తంభించింది. పలు ప్రాంతాల్లో రహదారులు, మురికి కాలువలు జలమయమయ్యాయి. వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. సారంగపూర్ మండలంలోని పలు ప్రాంతాల్లో వరద నీరు రోడ్లపై పారింది. ధర్మపురి మండలంలోని నేరెల్ల పశువుల పాపన్నగుట్ట వద్ద జాతీయ రహదారిపై వరద నీరు ప్రవహించడంతో జగిత్యాల- మంచిర్యాల జిల్లాల మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాయికల్ మండలంలోని మైతాపూర్ లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వదర నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ధర్మపురి మండలంలోని ఆకు సాయిపల్లె వద్ద లో లెవల్ వంతెన నీట మునగడంతో బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ నుంచి ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య వాగు తాత్కాలిక రోడ్డుపై నుంచి ప్రవహించడంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచి పోయాయి. పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటలు, లోలెవల్ వంతెనలు, గోదావరి ఉధృతిని కలెక్టర్ సత్య ప్రసాద్ పరిశీలించారు. ధర్మపురి పట్టణం లోని కాశెట్టివాడలో ఓ పెంకుటిల్లు నేలమట్టమైంది. గొల్లపల్లి మండల కేంద్రంలో రెండు ఇళ్లు కూలిపోయాయి.



కండ్లపల్లి-తుంగూర్ గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

వైద్యానికి ఆర్థిక సహాయం

గొల్లపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లన్న పేట గ్రామంలో భీమ జల-రమేష్ అనే దంపతులకు నాలుగు రోజుల క్రితం మగబిడ్డ జన్మించగా అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యఖర్చుల నిమిత్తం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ముత్యాల స్వామి రూ.10,500 ఆర్థిక సాయం అందించి శనివారం అండగా నిలిచాడు. తమ చిన్నారి వైద్యానికి తన వంతు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచిన స్వామికి బాధిత నిరుపేద యువ దంతపులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వామిని పలువురు అభినందించారు.

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ పరామర్శ

జగిత్యాలరూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రూరల్ మండల బీఆర్ఎస్ మహిళ అధ్యక్షురాలు ఎడ్ల లక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతుండగా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వసంత శనివారం పరామర్శించారు. ఆరోగ్యపరస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట రూరల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు రెంటం సత్తన్న ఉన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా అశోక్

జగిత్యాలరూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన మ్యాదరి అశోక్ న్యాయవాది బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. గతంలో అశోక్ సతీమణి వనిత జగిత్యాల అర్బన్ మండల ఎంపీపీగా పనిచేశారు. రెండేళ్ల క్రితం అశోక్ బీజేపీ పార్టీలో చేరి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పనిచేస్తూ పార్టీకి విధేయుడిగా ఉంటూ వస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన బీజేపీ అధిష్టానం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. తనపై నమ్మకంతో జిల్లా పదవిలో చోటు కల్పించి తన నియామకానికి సహకరించిన ఎంపీ అర్వింద్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబులకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
అలరించిన చిన్నారుల వేషధారణ
8

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

-కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఫీల్డ్ ఆఫీసర్లు, సిబ్బందిని అప్రమత్తంగా చేస్తూ నిత్యం ఫీల్డ్ లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 24 గంటలూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. జగిత్యాల మండలం రూరల్ గ్రామం అనంతారంలో లెవెల్ వంతెన, రాయపట్నం వంతెన, ధర్మపురి గోదావరి పరివాహక ప్రాంతం, నేరెళ్లలో లో లెవన్ వంతెన, సారంగాపూర్ మండలం రెచపల్లి ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్, రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్ బీ, పంచాయితీరాజ్, ఇరిగేషన్ శాఖలను సమన్వయం చేసుకుంటూ చర్యలు చేప ట్టాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రమాదకర పరిస్థితి తలెత్తితే టోల్‌ఫ్రీ నెంబర్ 9866234383 కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

●ధర్మపురి: ధర్మపురి మండలంలోని నీట మునిగిన ఆకుసాయిపల్లె లోలెవల్ వంతెన, రాయపట్నం, ధర్మపురి పట్టణంలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతాలను శనివారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రాయపట్నం బ్రిడ్జిపై నుండి, ధర్మపురి మంగళిగడ్డ స్నానఘట్టం వద్ద నుండి పెరుగుతున్న గోదావరి వరదను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మదుసూధన్, ధర్మపురి మండల తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో రవీందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, రవికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

●సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామంలో ఊర చెరువును స్థానిక అధికారులతో కలిసి కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా స్థానిక అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వహీదోద్దీన్, ఎంపీడీవో గంగాధర్, ఆర్ఐ వెంకటేష్, ఎస్సై గీత ఉన్నారు.



ధర్మపురిలో గోదావరి నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

సెల్‌ఫోన్ అప్పగింత


యజమానికి మొబైల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌కు చెందిన బలుసుల వంశీ ఇటీవల ఇరుకుల్లలో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు సీఈఐఆర్‌ను ఉపయోగించి ఫోన్ ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శనివారం కరీంనగర్ రూరల్ ఠాణాలో సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను అందజేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కోల్‌సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఫైవింక్లయిన్ ఈద్గా వద్ద చెట్ల పొదల్లో పేకాట స్థావరంపై శనివారం వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారైనట్టు ఆయన తెలిపారు. చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి నిర్వహించగా 8మంది పేకాట ఆడుతున్నారని, అందులో ఐదుగురిని అరెస్టు చేయగా, మిగతా ముగ్గురు పరారీలో ఉన్నట్టు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.06లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

- 75.1 శాతంతో రాష్ట్రంలోనే జగిత్యాల జిల్లా మొదటిస్థానం
- ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిర్మల్, పెద్దపల్లి
- ఆందోళన కలిగిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ గణాంకాలు



ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరుగుతున్న సిజేరియన్లు



జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిజేరియన్లు అధికంగా జరుగుతున్నాయి. గత జూలై వరకు సిజేరియన్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జగిత్యాల జిల్లా 75.1 శాతంతో మొదటి స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. నిర్మల్ జిల్లా 74.1 శాతంతో ద్వితీయ స్థానంలో, పెద్దపల్లి 72.7 శాతంతో తృతీయ, హన్మకొండ 72.7 శాతంతో నాల్గవ, కరీంనగర్ 71.3 శాతంతో ఐదో స్థానంలో ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు అంటున్నాయి. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిజేరియన్లు అధికంగా జరిగిన తొలి ఐదు జిల్లాల్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్‌లు ఉండడం గమనార్హం.

● జగిత్యాలలో అధికం..

జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 7,120 ప్రసవాలు జరగ్గా, అందులో 2,511 సాధారణ, 4,609 సిజేరియన్లు ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6,451 ప్రసవాలు జరగ్గా, అందులో 2,383 సాధారణ, 4,068 సిజేరియన్లు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,551 ప్రసవాలు జరగ్గా, అందులో 2,327 నార్మల్, 4,224 సిజేరియన్ ప్రసవాలున్నాయి. 2025 ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల కాలంలో 1,612 ప్రసవాలు జరగ్గా అందులో 422 సహజ ప్రసవాలు, 1,190 సిజేరియన్లు జరిగినట్లు వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో గత మూడు సంవత్సరాల కాలంలో సిజేరియన్లు అధికంగా జరిగాయి.

● కారణాలు అనేకం...

సాధారణ ప్రసవం చేయాలంటే కొన్ని గంటల సమయం పడుతుంది. ఈ క్రమంలో గర్భిణి, కడుపులోని బిడ్డ ఆరోగ్య పరిస్థితిని వాకబు చేస్తూ ఉండాలి. దీని కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో నిపుణులైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాల్సి వస్తుండడంతో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సిజేరియన్ వల్ల కలిగే సమస్యలను వివరించి, సాధారణ ప్రసవానికి సిద్ధపడేలా గర్భిణి, కుటుంబ సభ్యులను కౌన్సెలింగ్ చేసే ప్రయత్నం కూడా చేయకపోవడం కారణాలుగా నిలుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులకు పౌష్టికాహారం లేక రక్తహీనత కారణంగా సిజేరియన్లు జరుగుతున్నాయన్న అభిప్రాయాలున్నాయి. కొందరు శుభ ముహూర్తాలు అంటూ సిజేరియన్ చేయిస్తున్నారు. సాధారణ ప్రసవం నొప్పులను తమ కూతురు తట్టుకోలేదని కొందరు తల్లిదండ్రులు ఒత్తిడి చేయిస్తుండడంతో వైద్యులు చేసేదేమీ లేక సిజేరియన్ల వైపు మొగ్గు చూపుతున్నారని అంటున్నారు. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సిజేరియన్లు అధికంగా జరుగుతుండడంపై ఇటీవల కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్‌లు దృష్టి సారించి ప్రభుత్వ వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సాధారణ ప్రసవాలు పెంపొందించాలని ఆదేశించారు.

● డబ్ల్యూహెచ్‌వోమార్గదర్శకాలు ఇలా...

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల ప్రకారం మొత్తం ప్రసవాల్లో సిజేరియన్లు 10 నుంచి 15 శాతానికి మించకూడదు. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాల్లో 71.3 శాతం మేర సిజేరియన్లు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వీటిలో చాలా వరకు అవసరం లేకపోయినా సిజేరియన్లు చేసినట్లు అధికా రులు అనుమానిస్తున్నారు. సాధారణ ప్రసవం చేయడానికి వీల్లేని పరిస్థితుల్లోనే సిజేరియన్లు చేసినట్లు సర్కారు ఆసుపత్రుల వైద్యుల పే ర్కొంటున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు.

సాధారణ ప్రసవాలు పెంచేలా చర్యలు

-డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జగిత్యాల



జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధిక శాతం సిజేరియన్లు జరుగుతున్నట్లుగా గుర్తించాం. జూలైలో రాష్ట్రంలోనే సర్కారు ఆసుపత్రుల్లో సిజేరియన్లలో జగిత్యాల జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. అయితే పరిస్థితిలో మార్పు తీసుకొని రావడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వ వైద్యాధికారులతో ఇటీవల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమీక్ష నిర్వహించాం. భవిష్యత్తులో సిజేరియన్లు వీలైనంత వరకు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నాం.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


అంగడి రాజు(ఫైల్)

వెల్గటూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దమ్మన్నపేటకు చెందిన అంగడి రాజు(26) అనే యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. గొల్లపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన అంగడి రాజు జీవితంపై విరక్తిచెంది ఈనెల 14న ఎండపల్లి గ్రామ శివారులో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా మహాసభలు వాయిదా

హుజూరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా 5వ మహాసభలు ఆదివారం జరగాల్సి ఉండగా, భారీవర్షాల దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి కొప్పుల శంకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి తేదీలు ప్రకటిస్తామని తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడు

● చికిత్స పొందుతూ మృతి


రాహుల్(ఫైల్)

సైదాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారం గ్రామపంచాయతీ పరిధిలోని బూడిదపల్లి గ్రామానికి చెందిన అమరగొండ రాహుల్(20) అనే యువకుడు పురుగుల మందు తాగగా వరంగల్ ఎంజీఎంలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాహుల్ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో గుంటి చంద్రమౌళి తన వ్యవసాయ బావి వద్ద రాహుల్ ఉన్నాడని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అక్కడికి వెళ్లి చూడగా రాహుల్ పురుగుల మందుతాగి ఉన్నాడు. వెంటనే ద్విచక్రవాహనంపై సింగాపూర్ వరకు అక్కడినుంచి 108లో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైనచికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. తన కొడుకుకు మూడురోజుల క్రితం జ్వరం రాగా సైదాపూర్‌లోని ఓ ఆర్‌ఎంపీకి చూపించామని, అతను పరీక్షలు చేసి పచ్చలు అయినట్లు తెలిపాడని తల్లి విజయ తెలిపింది. పచ్చలు అయిన తనను ఆస్పత్రికి తీసుకపోతలేరని మనస్థాపం చెంది తన కొడుకు రాహుల్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకొన్నాడని పేర్కొంది. తన కొడుకు మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కాగా రాహుల్ తనకు ఎవరిపై కోపం లేదని తనకు జీవి తంపై విరక్తి చెందిందని, తాను సంతోషంగా చనిపో తున్నానని సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన పంజాల కృష్ణ(40) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పంజాల కృష్ణ, వనం హరీష్ అనే వ్యక్తికి రూ.25లక్షలు అప్పుగా ఇచ్చాడు. కృష్ణ ఆ డబ్బులు అడిగితే హరీష్ బెదిరించాడు. దీంతో మనస్థాపానికి గురైన కృష్ణ ఈనెల 3న హైస్కూల్ గ్రౌండ్‌లో పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియో తీశాడు. గమనించిన స్థానికులు వెంటనే హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కృష్ణ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు కృష్ణ భార్య తిరుమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

కాలువలో పడి మేకల కాపరి మృతి

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ధర్మపురి మండలం దొనూర్ గ్రామానికి చెందిన మానం చంద్రయ్య (59) అనే మేకల కాపరి ప్రమాదవశాత్తు ఎస్‌ఆర్‌ఎస్‌పీ పిల్ల కాలువలో పడి శనివారం మృతి చెందాడు. చంద్రయ్య దొనూర్ గ్రామ శివారులో గల భీమన్న గుట్ట సమీపంలో మేకలు కాస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో జారి పడి మృతి చెందాడు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

దొంగల ముఠా అరెస్ట్

● 12 తులాల బంగారం, కారు, రూ.15వేలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పట్టుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శనివారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రాయికల్ లలితమాత శివారులోని గుడి సమీపంలో మామిడి తోటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురువ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మండలపల్లికి చెందిన వనం పాపయ్య, టీఆర్‌నగర్‌కు చెందిన వనం రాము, దాసరి రవిగా పోలీసులు గుర్తించారు. ఈ ముఠాకు చెందిన మరో నిందితుడు నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన జగన్నాథం కృష్ణ పరారీలో ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో వీరిపై ఇప్పటికే ఆరు కేసులు నమోదైనట్లు గుర్తించారు. నిందితుల నుంచి 12 తులాల బంగారం, రూ.15వేల నగదు, 3సెల్‌ఫోన్లు, ఒకకారు స్వాధీనం చేసుకున్నారు. వీరు ఒకముఠాగా ఏర్పడి జగిత్యాల, రాయికల్, మల్యాల, భూపాలపల్లి, భద్రాచలం, పరిసర ప్రాంతాల్లో దోపిడీలు, దొంగతనాలకు పాల్పడినట్లు తేలిందని 30కి పైగా కేసుల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు గుర్తించినట్లు డీఎస్పీతెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన జగిత్యాలరూరల్ సీఐ సుధాకర్, రూరల్ ఎస్సై సధాకర్, రాయికల్ ఎస్‌ఐ సుధీర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్, సుమన్‌లను డీఎస్పీ అభినందించి నగదు బహుమతి అందజేశారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్

జ్యోతినగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కలను పెంచుతున్న కేసులో నీలం కార్తిక్(33) అనే నిందితుడిని శవారం ఎన్టీపీసీ పోలీసులు అరెస్టు చేశారు. మేడిపల్లి గ్రామంలో కార్తిక్ ఇంటి పక్కన ఐదు గంజాయి మొక్కలను పెంచుతున్నాడని, మెక్కలు పెరిగిన తరువాత అమ్ముకొని డబ్బు సంపాదించాలనుకున్నాడని ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్వర్టు పనులను అడ్డుకున్న గ్రామస్థులు


కోనరావుపేటలో కల్వర్టు పనులను అడ్డుకుంటున్న గ్రామస్థులు

కోనరావుపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టు నిర్మాణం పనులను కోనరావుపేట గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. కల్వర్టు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిం చడంలేదని మండల కేంద్ర వాసులు ఆరోపిస్తున్నారు. పైపులు వేసిన తర్వాత కంకర సిమెంట్‌తో వేయాల్సి ఉండగా రౌతులు మట్టితో నింపుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు సందర్శించి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరారు.

గుంతలమయంగా కరీంనగర్-వరంగల్ రోడ్డు


మానకొండూర్‌లో గుంతలమయంగా కరీంనగర్-వరంగల్ రోడ్డు

మానకొండూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి గుంతలమయంగా తయారైంది. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలిచిపోవడంతో బస్సులు, లారీలు వెళ్లే సమయంలో ద్విచక్రవాహన దారులపై బురదనీరు పడుతోంది. చీకటి సమయంలో గుంతలు ఏర్పడకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు


సైదాపూర్ మండలం వెన్కేపల్లి సొసైటీ వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

సైదాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘానికి శనివారం యూరియా లోడ్ వస్తున్నదని తెలుసుకొని రైతులు పెద్దఎత్తున గోదాముకు చేరుకున్నారు. వర్షాన్ని సైతం లెక్క చేకుండా కవర్లు కప్పుకొని గోదామ్ ముందు యూరియా కోసం ఎదురు చూశారు. లోడ్ వచ్చిన వెంటనే రైతులను లైన్‌లో నిలబెట్టి వ్యవసాయధికారులు, సొసైటీసిబ్బంది ఒకొక్కరికి 2 బస్తాల చొప్పున పంపిణీ చేశారు. లోడ్‌లో 450బస్తాల యూరియా రాగా, చివరలో లైన్ నిలబడ్డ రైతులకు యూరియా అందక పోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

● బస్తాలు సరిపోవని పంపిణీ నిలిపివేత

శంకరపట్నం: మండలంలోని గద్దపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కాచాపూర్ సొసైటీ సిబ్బంది వచ్చిన యూరియా బస్తాల లోడ్ కంటే రైతులు ఎక్కువగా ఉన్నారని పంపిణీ నిలిపివేశారు. మరుసటి రోజు మరొకలోడ్ వస్తుందని, రైతులకు నచ్చ చెప్పడంతో అక్కడి నుంచి వారు నిరాశతో వెనుతిరిగారు.

వరకట్నం కోసం వేధించిన భర్తపై కేసు

కోనరావుపేట ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం భార్యని వేధించిన భర్తపై కేసు నమోదు చేసినట్లు కోనరావుపేట ఎస్సై కే ప్రశాంత్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం కోనరావుపేట మండలంలోని అజ్మీర తండా గ్రామానికి చెందిన లకావత్ జ్యోతిర్మయి వివాహం 2018లో కొడిమ్యాల మండలం సూరంపేటకి చెందిన భూక్యా రమేష్‌తో జరిగింది. కొన్ని రోజుల నుంచి రమేష్ తన భార్య జ్యోతిర్మయినిఅదనంగా ఐదులక్షల రూపాయల వరకట్నం తీసుకరావాల్సిందిగా శారీరకంగా మానసికంగా వేధిస్తున్నాడు. శనివారం జ్యోతిర్మయి ఫిర్యాదు చేయడంతో రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అసంపూర్తిగా పీహెచ్‌సీ

- మూడేళ్లుగా పట్టించుకున్న నాథుడే లేడు
- ఇబ్బందుల్లో గ్రామప్రజలు
- గ్రామపంచాయతీ కార్యాలయంలో విధులు చేస్తున్న వైద్యసిబ్బంది

చిగురుమామిడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో గత ప్రభుత్వం హయాంలో నిర్మాణం చేపట్టిన పీహెచ్‌సీ భవనం అసంపూర్తిగా మిగిలింది. మండలంలో రెండో మేజర్ గ్రామ పంచాయతి అయిన బొమ్మనపల్లిలో దాదాపు 5వేల మంది జనాభా ఉంటారు. ఎక్కువశాతం ప్రజలు ప్రభుత్వం అందించే వైద్యంపైనే ఆధారపడి ఉంటారు. సంబంధిత కాంట్రాక్టరు పీహెచ్‌సీ భవనాన్ని బేస్‌మెంట్ వరకు నిర్మించి వదిలేశాడు. నాటి నుంచి నేటి వరకు పనులు చేయలేదు. దీంతో ఉన్న నిర్మాణం కాస్తా శిథిలావస్థకు చేరింది. వైద్య సిబ్బందికి సరైన సదుపాయాలు లేక గ్రామపంచాయతీ కార్యాలయంలోని ఒక రూమ్‌లో విదులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పల్లే దవాఖానా సైతం ఇదే గ్రామ పంచాయతీలోనే ఏర్పాటు చేశారు. ప్రజలు వైద్యసేవలు పొందడానికి అనేక ఇక్కట్లు పడుతున్నారు. పీహెచ్‌సీ పరిస్థితిపై అనేక సార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో చర్చకు వచ్చినా ఎలాంటి ముందడుగు పడలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ వెంటనే అసంపూర్తిగా ఉన్న పీహెచ్‌సీ భవన పనులు ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామప్రజలు, నాయకులు, మహిళా సంఘులు కోరుతున్నాయి.


బొమ్మనపల్లిలో అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం


గ్రామ పంచాయతీ కార్యాలయంలో సేవలందిస్తున్న వైద్యసిబ్బంది(ఫైల్)

అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు..

- మిట్టపల్లి మల్లయ్య, మాజీ ఎంపీటీసీ,

గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను ఆపేశాడు. అప్పటినుంచి భవన నిర్మాణాన్ని పట్టించుకున్న వారే లేరు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నాయకులు స్పందించి భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

వినాయక మండపాల వద్ద

డీజేలను ఉపయోగిస్తే కఠిన చర్యలు

● సరస్వతీనగర్‌లో డీజేతో నృత్యాలు.. ఒకరి బైండోవర్

● కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి


రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వినాయకమండపాల వద్ద డీజేసౌండ్ వాడుతూ నృత్యాలు చేయటం, పాటలు పాడటం వంటిచేస్తూ వృద్ధులకు, చిన్నపిల్లలకు ఇబ్బందులను కలగిస్తే చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని కరీంనగర్‌రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సరస్వతీనగర్‌లో డీజేలతో నృత్యాలు చేసి స్థానికులకు ఇబ్బంది కలిగించిన ఫిర్యాదుతో నిర్వాహకుడిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అధిక స్థాయిలో కాలుష్యాన్ని సృష్టించే డీజేలు, భారీ సౌండ్‌సిస్టంల వినియోగం పూర్తి నిషేదమని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అధిక స్థాయిలో శబ్ధకాలుష్యానికి కారణమైన డీజేలు, సౌండ్ సిస్టంలు నిషేధమని, ఈ విషయంలో గణేష్ మండప నిర్వాహకులు పోలసులకు సహకరించాలన్నారు. గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపననుంచి వినాయక నిమజ్జనం వరకు డీజేలు, మైకులు ఉప యోగించకుండా నిబంధనలు పాటించాలన్నారు. పండుగల వేళ కరీంనగర్‌రూరల్ మండలంలోని రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతున్నామని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, ప్రజలను భయబ్రాంతులకు గురిచేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి వదంతులను, మెసేజ్‌లు(వాట్సాప్) నమ్మకూడదన్నారు.

ఇటువంటి వదంతులను వ్యాప్తి చేస్తూ సామాజికమాధ్యమాలలో పోస్టులు పెట్టే ఏస్థాయి వారైనా చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాస్పద, అభ్యంతకరమైన పోస్టులు, వదంతులపై ఎవరికైనా సందేహాలు ఉంటే పోలీసులకు డయల్ 100కు సమాచారం అందించాలని సీఐ కోరారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు



రామడుగు: గాయత్రి పంపుహౌజ్ నుంచి ప్రవహిస్తున్న నీరు

ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు

- గోదావరిలో పెరిగిన ప్రవాహం
- ఎల్లంపల్లికి పోటెత్తుతున్న వరద

అంతర్గాం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తుతోంది. ఎగువన గల కడెం ప్రాజెక్టు, వాగులు, వంకలు ద్వారా వరద నీరు చేరుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పాటు కడెంప్రాజెక్టు 17గేట్లుఎత్తి లక్షా80వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెట్టారు. దీంతో రాత్రి 11గంటల సమయానికి ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 148.00మీటర్లకు గాను ప్రస్తుతం 147.24 మీటర్లకు నీరుచేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.063టీంఎసీల నీరు నిలువ ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 2,11,817క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 2,11,817 క్యూసెక్కులు ఉండగా, హైదరాబాద్‌మెట్రో పాలిటన్ వాటర్‌స్కీం కోసం 286క్యూసెక్కులు, ఎన్టీపీసీ అవసరాలకు 121క్యూసెక్కులు, పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్ హౌజ్‌కు 9,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● కడెం గేట్లు ఎత్తివేత..

కడెం రిజర్వాయర్‌కు ఉన్న18గేట్లలో 17గేట్లు తెరిచి 1,07,161 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పూర్తిస్థాయిలో నీరు చేరడంతో రాత్రి వరకు 20 గేట్లను ఎత్తి 2,01,960 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు

● నంది పంప్‌హౌజ్ ద్వారా ఎత్తిపోతలు

ధర్మారం: ఐదు రోజలుగా నంది మేడారంలోని నంది పంప్‌హౌజ్ ద్వారా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. రోజు ఉదయం 7-30నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు 3పంపుల ద్వారా 9450క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఏవైనా మార్పులు ఉంటే మినహా అనుకున్న షెడ్యూల్‌ప్రకారం ఆదివారం వరకు ఎత్తిపోతలు కొనసాగుతాయని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

● గాయత్రి పంపుహౌజ్ నుంచి నీటి విడుదల

రామడుగు: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపు హౌజ్ శనివారం మూడు పంపుల ద్వారా వర్షాకాలానికి నీటిని విడుదల చేశారు. 9450క్యూసెక్కుల నీటివిడుదల చేయగా నేరుగా మధ్యమానేరుకు తరలి వెళ్తోంది. ఇప్పటివరకు రెండుటీఎంసీల నీటిని మిడ్‌మానేరుకు తరలించినట్లు తెలిపారు.



నంది పంప్‌హౌజ్ ద్వారా నీటి తరలింపు

● మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో


బోయినిపల్లి : మండలంలోని శ్రీరాజరాజేశ్వర జలాశ యానికి ఎల్లంపల్లి జలాల ఎత్తిపోతలతో పాటు, మూలవాగు, మానేరు ద్వారా నీటీ ప్రవాహం కోనసాగుతోంది. ప్రాజెక్టులోకి శనివారం వరకు 12980 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గాయత్రి పంప్‌హౌజ్ నుంచి 11,000 క్యూసెక్కులు, మూల వాగు, మానేరుద్వారా 1,332క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతున్నట్లు ప్రాజెక్టు డీఈరాజు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటీమట్టం 318 మీటర్లకుగాను ప్రస్తుతం 308.96మీటర్లు, నీటి నిల్వసామర్థ్యం, 27.55 టీఎంసీలకు గాను 9.850 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

● ఎల్ఎండీకి పెరుగుతున్న ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్: ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. 15వతేది రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో 16వతేది సాయంత్రానికి 1168క్యూసె క్కుల ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో ఎల్ఎండీలో ప్రస్తుతం నీటి నిలవ 7.252టీఎంసీలకు చేరింది. ఎల్ఎండీ పూర్తి నీటిసామర్థ్యం 24.034 టీఎంసీలు. మిషన్‌భగీరథ, ఆవిరి రూపంలో 219 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెలుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

● కాకతీయ కాలువకు నీరు

గంగాధర: కాకతీయ కాలువకు కాళేశ్వరం నీరును విడుదల చేశారు. గాయత్రి పంపుహౌజ్ నుంచి మోటర్ల ద్వారా గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ వరదకాలువకు నీరును విడుదల చేశారు. నాలుగు రోజుల క్రితం రెండు మోటర్లను ఆన్ చేయగా శనివారం ఐదుమోటర్లతో నీటిని దిగువకు తరలిస్తున్నారు. శనివారం ఒక్క మోటర్‌ను నిలిపేసి నాలుగు మోటర్లతో నీటిని వరద కాలువకు తరలిస్తున్నారు. ప్రస్తుతం 15వేల క్యూసెక్కుల నీరు వరద కాలువకు విడుదలవుతోంది. కాళేశ్వరం నీరు నాగిరెడ్డిపూర్ వరద కాలువ నుంచి రివర్స్‌గా ఎగువకు తరలుతున్నాయి. ఇదే సమయంలో ర్యాలపల్లి వద్ద వరద కాలువపై ఏర్పాటు చేసిన లింక్‌ను తెరచి కాకతీయ కాలువకు నీరును విడుదల చేశారు. 900క్యూసెక్కుల నీరు మల్యాల మండలం తాటిపెల్లి సమీపంలోని కాకతీయ కాలువ నుంచి పెద్దపల్లికి తరలిస్తున్నారు. రైతులు పంటలకు నీరు విడుదల చేయాలని కోరడంతో నీటిని కాకతీయ కాలువకు విడదల చేస్తున్నారు. గాయంత్రి పంపుల నుంచి నీరు విడుదల చేయడంతో గంగాధర మండలంలోని ర్యాలపల్లి, కొండయ్యపల్లి, బూరుగుపల్లి, నాగిరెడ్డిపూర్, కురిక్యాల, కొండన్నపల్లి, తాడిజెర్రి, రంగరావుపల్లి, గర్షకుర్తి, ఆచంపల్లి గ్రామాల ఆయకట్టుకు సాగు నీరు అందుతోంది. అరకొర వర్షాలతో ఆగమైన రైతులు వరద కాలువకు నీరు విడుదల చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ర్యాలపల్లి వరద కాలువ నుంచి కాకతీయ కాలువకు తరలుతున్న నీరు

● ధర్మపురి వద్ద ఉగ్రరూపం దాల్చిన గోదావరి

- కడెం ప్రాజెక్టు 17 గేట్లు ఎత్తి నీరు విడుదల



ధర్మపురి దిగువ భాగంలో రాయపట్నం వైపు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్న గోదావరి నది

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో శనివారం గోదావరి నది ఉగ్ర రూపం దాల్చింది. గోదావరి ఎగువ మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరిలో నీరు చేరుతోంది. నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. దీంతో కడెం ప్రాజెక్టు సంబంధించిన 17 గేట్లు ఎత్తి అధికారులు దిగువ గోదావరి నదిలోకి నీటిని విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం పెరిగి ఉధృతంగా మారింది. రాయపట్నం పాత వంతెన నీటిలో మునిగి పోవటంతో అటు వైపు ప్రజలను వెళ్లనీయకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

శ్రీరాంసాగర్‌కు అత్యధికంగా వరద

- ప్రాజెక్టులోకి 1,04,879 క్యూసెక్కుల వరద
- ఒక్క రోజులో ఏడు టీఎంసీల నీరు



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ప్రస్తుత సీజన్‌లో అత్యధికంగా వరద నీరు వస్తోంది. శనివారం ఉదయం 89 క్యూసెక్కులకు పైగా వచ్చిన వరద, సాయంత్రం వరకు కొంత పెరిగి సుమారు 1,29,393 క్యూసెక్కుల వరకు వస్తోంది. కేవలం ఒక్క రోజు వ్యవధిలో డ్యామ్‌లో సుమారు ఏడు టీఎంసీలకు పైగా నీరు వచ్చి చేరింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం వరద నీరు రావడం భారీగా పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, విష్ణుపురి పరివాహక ప్రాంతం నుంచి గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 56.980 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 48.071 టీఎంసీల నీరు ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 46.930 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 8.937 టీఎంసీల నీటిని విడుదల చేశారు.

● గోదావరి పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల గోదావరిలో భారీగా వరద నీరు పెరిగే అవకాశం ఉన్నందున గోదావరి పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్ఎస్‌పీ ఈఈ చక్రపాణి ఒక ప్రకటనలో కోరారు. పశువులు, గొర్రెల కాపర్లు, చేపలు పట్టే వారు, రైతులు, సామాన్య జనం గోదావరి దాటే ప్రయత్నాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..



కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారి ఉద్వి

ఆలయాల్లో శ్రావణ సందడి

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రావణసందడి నెలకొంది. శనివారం లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఉగ్రనరసింహ, వేంకటేశ్వర, రామలింగేశ్వరస్వామి, గణపతి ఆలయాల్లో ఉదయం ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు యమధర్మరాజు ఆలయం వద్దగండ దీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, సోదరుడు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ ప్రతినిధి బిగాల మహేష్‌గుప్తా శనివారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవోసంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఉపప్రధానఅర్చకులు నేరెళ్లశ్రీనివాసా చార్యులు, ముఖ్యఅర్చకులు నంబి శ్రీనివాసాచారి,రమణాచార్య, నంబినరసింహమూర్తి, ద్యావళ్లవిశ్వనాథశర్మ పాల్గొన్నారు.



ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. శ్రావణ మాసం కావడంతో భక్తులు అంజన్నసన్నిధికి వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు ఇతర పూజలు చేశారు. వేకువజాము నుంచి వర్షం కురియడంతో భక్తులకు ఇబ్బందులు పడ్డారు.



కొండగట్టు ఆలయంలో భక్తులు

యూటర్న్ ఏర్పాటు చేయాలి



బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

శంకరపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు గ్రామంలోని పంచాయతీ ముందు ప్రజల సౌకర్యార్థం యూటర్న్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు శనివారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్ డ్రైవింగ్.. యమ డేంజర్

- మ్యూజిక్ వింటూ బైక్స్ నడుపుతున్న యువత
- అతివేగంతో రెప్పపాటులో ప్రమాదం
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడుపుతున్న సమయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఏకగ్రతతో డ్రైవింగ్ చేస్తే సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చు. అయితే ఏ వాహన చోదకుడిని చూసినా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడమే కనిపిస్తుంది. ఇంకొందరు ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని మ్యూజిక్ జోష్‌లో అతివేగంగా వాహనాలను నడుపుతున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల ప్రాణాలు గాలిలో కలుస్తున్నా యి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం వల్ల ఏకాగ్రత లోపించి ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. రాజన్న సరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 2024లో ఇప్పటి వరకు 288 రోడ్డు ప్రమాదాలు సంభవించగా 85మంది మృతిచెందగా 299మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఏడాది ఏడు నెలల్లో దాదాపు 212 రోడ్డు ప్రమా దాలు చోటుచేసుకోగా 40మందికి పైగా మృతిచెందారు. 162 మందికి పైగా గాయాలపాలయ్యారు. ఇందులో సెల్‌ఫోన్ మాట్లా డుతూ వాహనం డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారినపడిన వారు అనేకమంది ఉన్నారు.

● ఇయర్ ఫోన్‌లో సంగీతం వింటూ..

యువత ఇయర్‌ఫోన్‌ల ద్వారా మ్యూజిక్ వినే జోష్‌లో ద్విచక్రవాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. యువతను హోరెత్తించే రాకింగ్ మ్యూజిక్, మైమరిపించే పాటలు, ఎక్కువ డెసిబెల్స్‌లో శబ్దాలతో ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని రోడ్డుపై వాహనాలు నడుపుతూ వెనుక వచ్చే వాహనాలను పట్టించుకోవడంలేదు. ఇటీవల కాలంగా వాయిస్ క్యాన్సలేషన్ ఇయర్‌ఫోన్లు, హెడ్‌ఫోన్లు వాడకం పెరిగింది. వీటి ద్వారా బయట శబ్దాలు అసలు వినిపించవు. ఈ తరహా ఇయర్‌ఫోన్లు వాడుతూ రోడ్డు దాటడం, డ్రైవ్ చేయడం అత్యంత ప్రమాదకరం. మనచుట్టుపక్కన శబ్దాలు వినిపించక ప్రమాదాలు పొంచి ఉంటాయి. మరోవైపు ఇతరుల ప్రాణాలు పోవడానికి కారకులవుతున్నారు. చాలామంది వాహన చోదకులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, ఇయర్ ఫోన్స్ పెట్టుకొని పాటలు వింటూ వాహనాలను నడుపుతున్నారు. ద్విచక్రవాహనదారులేే కాకుండా ఆటోలు, కార్లలో పెద్ద సౌండ్స్‌తో పాటలు వింటూ డ్రైవింగ్‌చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.



వాహనాలను తనిఖీచేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

● సెల్ హెల్మెట్‌లో పెట్టి మాట్లాడటం..

హెల్మెట్‌లో సెల్‌ఫోన్ పెట్టుకొని మాట్లాడుతూ డ్రైవ్ చేస్తూ ప్రమాదాలకు మూలమవుతున్నారు. ద్విచక్రవాహనాలు నడిపే చాలా మంది హెల్మెట్‌లో సెల్‌ఫోన్ పెట్టుకొని ఇతరులతో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారు. హెల్మెట్‌లోపల చెవి దగ్గర సెల్‌ఫోన్ పెట్టుకోవడంతో పక్కనుంచి వచ్చే వాహనాల హారన్ వినడ పడక ప్రమాదాల బారిన పడుతున్నారు. పక్కన వచ్చే వాహనదారులతో గొడవకు దిగి బావోద్వేగానికి లోనైతే డ్రైవింగ్ మీద దృష్టిని మరల్చుతుంది. మరోవైపు మెడ వంచి చెవికి, భుజానికి మధ్యన సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం సాధారణమైపోయింది. ఈ విధమైన డ్రైవింగ్ ఏకాగ్రతను దెబ్బతీస్తుంది. కొందరు ఫోన్‌లు పట్టుకొని మెస్సెజెస్,చాటింగ్ చేస్తూ డ్రైవ్‌చేస్తుంటారు. మరోవైపు తింటూ డ్రైవ్ చేయడం, డ్రైవ్‌చేస్తూ సెల్ఫీ తీసుకోవడం ప్రమాదమని భావించాలి.

● డ్రైవింగ్‌పై దృష్టిపెడితే క్షేమంగా గమ్యం

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ క్షేమంగా గమ్యం చేరాలంటే డ్రైవింగ్‌పై ఏకాగ్రత అవసరం, చాలామంది సెల్‌ఫోన్ డ్రైవింగ్ పెద్ద తప్పుకాదులే అనుకుంటారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్‌కి సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్‌చేయడం ఏమి తీసిపోదని పోలీసులు వాహనాదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా స్టీరింగ్ చేతిలో ఉన్నప్పుడు ఫోన్ మాట్లాడననే నియమం పెట్టుకోవాలని చెపుతున్నారు. క్షేమంగా గమ్యం చేరాలి.. ఇతరులు క్షేమంగా గమ్యం చేరేలా వాహనాదారులు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు విస్తృత తనిఖీలు

- మహేశ్ బి. గీతే , ఎస్పీ , రాజన్న సిరిసిల్ల



రోడ్డు ప్రమాదాల నివారణకు తనిఖీలు చేపట్టాం. ప్రతి శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతాయి. డ్రైవింగ్ సమయంలో నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. యువత వాహనాలపై అతివేగంగా వెలుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మైనర్‌లకు వాహనం ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదుచేస్తాం. వాహనాలు నడుపుతుండగా సెల్‌ఫోన్ మాట్లాడవద్దు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

- వర్షంలోనూ రాజన్న దర్శనం కోసం బారులు
- ఆలయంలో ఘనంగా గోకులాష్టమి వేడుకలు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ రాజరాజే శ్వరస్వామి వారి ఆలయంలో శ్రావణమాసం రద్దీ కొనసాగుతోంది. శనివారం ఉదయం వర్షంలోను భక్తులు రాజన్న ఆలయానికి పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కులు చెల్లించుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

● ఘనంగా గోకులాష్టమి వేడుకలు..

గోకులాష్టమి సందర్భంగా ఉదయం 6.30గంటలకు అర్చకులు అన్ని వైష్ణవ దేవాలయాల్లో అభిషేకము, అర్చనలను ఘనంగా నిర్వహించారు. భీమేశ్వరస్వామి వారి ఆలయంలో మహాపూజ చేపట్టారు. రాత్రి ఎనిమిది గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో ఉట్లు కొట్టుట, డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజన్న ఆలయఈవో రాధాబాయి, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు తదితరులు హాజరయ్యారు. వేములవాడ పట్టణంలోని యాదవ్ యూత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. యువకులు పెద్దసంఖ్యలో హాజరై ఉట్టికొట్టుటలో ఉత్సహంగా పాల్గొన్నారు.



ఆలయంలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న అర్చకులు

బాధిత కుటుంబానికి పరామర్శ

కొడిమ్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచుపల్లి గ్రామంలో కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు తల్లి ప్రేమలత ఇటీవల మృతి చెందగా శనివారం సాయంత్రం బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు. మృతురాలి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విప్ వెంట కొడిమ్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌గౌడ్, సీనియర్ నాయకులు ముమ్మాడి స్వామి, గోల్కొండ రాజు, జలెందర్, చింటు, గౌతం తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మల్యాల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేటకు చెందిన సంత లక్ష్మి అనే మహిళ రైతు ప్రమాదవశత్తూ బావిలో పడి మృతి చెందగా మృతురాలి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, మ్యాక లక్ష్మన్, ప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం

సారంగాపూర్, ఆగస్టు, 16(ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు ఓరుగంటి రమణరావు విమర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని రమణరావు తీవ్రంగా ఖండించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ రైతుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించాడని సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పాలిట రాబందువుగా మారడని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద ప్రస్తుతం పంపులు నడుస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు వెళ్ళి చూస్తే కనిపిస్తుందన్నారు. అనంతరం బట్టపెల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ కోల రాఘవులు అనారోగ్యంతో మృతి చెందగా శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు సాగి సత్యంరావు, బల్మూరి నారాయణరావు, బైరి మల్లేష్ యాదవ్, చీటి రమణరావు, అర్రె ప్రేమనందం, తదితరులు ఉన్నారు.

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా ఇరుగురాల భూమేశ్వర్

పెగడపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిగా పెగడపల్లి మండలం కీచులాటపల్లి గ్రామానికి చెందిన ఇరుగురాల భూమేశ్వర్ వరుసగా రెండవసారి ఎన్నికయ్యారు. కోరుట్ల పట్టణంలో జరిగిన ఆ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో భూమేశ్వర్‌ను రెండవ సారి ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం పెగడపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ సీపిఐ పక్షాన ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ముందుండి పోరాటం చేయ నున్నట్లు పేర్కొన్నారు.

పొంగిపొర్లిన వాగులు, వంకలు

●జిల్లాలో విస్తారంగా వర్షాలు ● పలు ప్రాంతాల్లో నిలిచిన రాకపోకలు



మైతాపూర్ వాగును పరిశీలిస్తున్న అధికారులు



మల్యాల శివారులో ప్రవహిస్తున్న వరద కాలువ

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో శనివారం కురిసిన వర్షానికి అనేక గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండిపోయాయి. రోడ్లు జలమయం కావటంతో రైతులు, వ్యవసాయ కూలీలు పనులు చేసేందుకు బయటకు రాలేదు. ఆకుసాయిపల్లె లోలెవల్ వంతెన నీట మునిగి రాకపోకలు నిలిచి పోయాయి. పెద్దనక్కలపేట-చిన్ననక్కలపేట మధ్య గల వాగు వంతెన కింది నుంచి నీరు ప్రవహించడం వల్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. నల్లకుంట మత్తడిపైనుంచి నీరు ప్రవహిస్తోంది. ధర్మపురి పట్టణంలోని కాశెట్టివాడలో సాయిని అనసూయ ఇల్లు కూలిపోయింది. బాధితురాలికి తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ రూ.16,500 అందించారు. అలాగే వర్షానికి ఒక పశువుల పాక కూడా కూలిపోయింది. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు ఉదయ్‌కుమార్, రవికుమార్ సిబ్బందిచే ఆకుసాయిపల్లె గుట్ట వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను నిలిపి వేయించారు. నీట మునిగి పోయిన వంతెనను తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్ పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. మండలంలోని. మండలంలో పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. హరిత హోటల్ వెళ్లే దారిలో ఒక విద్యుత్ స్తంభం వంగి పోవడంతో ట్రాన్స్‌కో ఏఈఈ రవి ఆధ్వర్యంలో సిబ్బంది తిరిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అక్కపెల్లి చెరువు నిండి జల కళ సంతరించుకుంది.

కోటిలింగాల వద్ద గోదావరి వరద ఉధృతి

వెల్గటూర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని కోటిలింగాల వద్ద గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. తహసీల్దార్ శేఖర్ కోటిలింగాల, ముక్కట్రావుపేట వద్ద గోదావరి పరిస్థితిని పరిశీలించారు. గోదావరి పరిసర ప్రాంతాలకు చెందిన కోటిలింగాల, పాషిగామ, ముక్కట్రావుపేట, చెగ్యాం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ రామ్ నర్సింహారెడ్డి, తహసీల్దార్ శేఖర్, ఎస్సై ఉమాసాగర్ సూచించారు. వెల్గటూర్‌లో శనివారం కురిసిన వర్షానికి రాజక్కపల్లి వద్ద ఏడవ నంబరు రాష్ట్ర రహదారిపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రోడ్డు సమీపంలో ఉన్న బిల్లకూరి సురేష్ ఇంటి ఆవరణ లోకి నీరు చేరడంతో ఇబ్బంది పడ్డారు. తహసీల్దార్ శేఖర్ ఇంటిని పరిశీలించారు.

●రాయికల్: గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్ అన్నారు. మండలంలోని బోర్నపెల్లి వంతెనను శనివారం ఉదయం అధికా రులతో కలిసి పరిశీలించారు. మైతాపూర్ బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచి పోయాయి.

ప్రమాదకరంగా తుంగూర్-కండ్లపెల్లి బ్రిడ్జి

బీర్పూర్: మండలంలో శనివారం ఉదయం నుంచి ఎడితెరిపి లేకుండా కురిసిన వర్షానికి తుంగూర్ కండ్లపెల్లి గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారడంతో అధికారులు రాకపోకలు నిలిపి వేశారు. మూడు సంవత్సరాల క్రితం రోళ్ళవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో ప్రాజెక్టు నీటి తాకిడికి రోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యింది. తాత్కాలికంగా మట్టి పోసి మరమ్మతులు చేపట్టగా శనివారం ఉదయం నుంచి ఎడితెరిపి లేకండా కురిసిన వర్షానికి బ్రిడ్జి ఒడ్డును ఆనుకొని పోసిన మట్టి కొట్టుకొని పోయింది. దీంతో ఎస్సై రాజు, ఎంపీడీవో భీమేష్‌లు బ్రిడ్జిని పరిశీలించి వాహనాలు వెళ్లకుండా బ్రిడ్జికి అడ్డుగా చెట్ల కొమ్మలు వేశారు. మండలంలోని చెరువులు కుంటలు నిండి కళకళలాడుతున్నాయి. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎస్సై రాజు, ఎంపీడీవో భీమేష్, కార్యదర్శులు గోదావరి పరివాహక గ్రామాలైన రంగాసాగర్, మంగేళ, కమ్మునూర్, చిత్రవేణిగూడెం, రేకులపెల్లి, చిన్న కొల్వాయి గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

గొల్లపల్లిలో కూలిన రెండు ఇళ్లు

గొల్లపల్లి: మండలంలో శనివారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. పలు గ్రామాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. చిల్వాకోడూర్, దట్నూర్, భీంరాజ్ పల్లె, చెందోళి, ఆత్మకూర్, దమ్మన్నపేట, తిర్మలాపూర్ (పీడీ), రంగదాముని పల్లె, అబ్బాపూర్, బొంకూర్, లొత్తునూర్, లక్ష్మీపూర్ తదితర గ్రామాల్లో పత్తిపంటల్లోకి వరద నీరు ముంచెత్తడంతో ఇసుకమేటలు వేశాయి. మండల కేంద్రంలో చౌట్‌పెల్లి తిరుపతితో పాటు మరో వ్యక్తికి చెందిన పాత ఇల్లు కూలీపోయాయి.

●మల్యాల: మండలంలో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు నీటిని వదలడంతో నిండుగా ప్రవహిస్తోంది.

●పెగడపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో శనివారం లింగాపూర్ పెద్ద చెరువు, శాలపల్లె అడుపపల్లె గ్రామాల మధ్యన వాగును, నంచర్ల చెరువును తహసీల్దార్ బి.రవీందర్ పరిశీలించారు. ఆయన వెంట గిర్దావర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాకపోకలకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామాపూర్ ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య గల వాగుపై వేసిన తాత్కాలిక రోడ్డుపై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గతంలో ఇక్కడ ఉన్న లో లెవెల్ వంతెన స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు నిర్మాణ పనులను ఆపివేశారు. దీంతో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పక్కనే అప్రోచ్ రోడ్డును నిర్మించారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. తహసీల్దార్ వరప్రసాద్ వాగును పరిశీలించి వాగుకు ఇరువైపులా ట్రాక్టర్లు అడ్డుగా పెట్టిం చి రాకపోకలను నిలిపి వేయించారు.



కోటిలింగాల వద్ద నిండు కుండలా గోదావరి



ధర్మపురిలో కూలిన ఇల్లు

వేతన వెతలు

(ఐదో పేజీ తరువాయి)

నిర్వహించాల్సి ఉంటుంది. వీటికి తోడు క్షేత్ర స్థాయిలో సర్వేలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో రిసోర్స్ పర్సన్ లు విధులు నిర్వహిస్తున్నారు. పరిశుభ్రత, పారి శుధ్యం, హరితహారం, నిరక్షరాస్యత నిర్మూలన తది తర కార్యక్రమాల్లో రిసోర్స్ పర్సన్‌ల సేవలను అధికా రులు వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు నెలకు రూ.15 వేతనం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని రాజారం గ్రామానికి చెందిన డోంగరి అభిలాష్‌కు వైద్య చికిత్స కోసం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రూ.2.5 లక్షలు విలువ గల ఎల్‌వోసీ చెక్కును శనివారం అందించారు. అభిలాష్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపధ్యంలో కుటుంబానికి ఆర్థిక భారం పడటం వల్ల వెంటనే స్పందించి మంత్రి ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

ఆహ్లాదకరంగా రహదారి



పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉన్న కొడిమ్యాల-చెప్యాల రహదారి

కొడిమ్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండల కేంద్రమైన కొడిమ్యాల నుంచి చెప్యాల క్రాస్ రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు ప్రయాణికులను ఆకర్షిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించే ప్రయాణికులు వాహనాలను నిలుపుకొని చెట్ల మధ్య ఉన్న ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.

గాయత్రి బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

-బ్యాంకు ఉపాధ్యక్షుడు రవికుమార్

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి: ది గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు ఉపాధ్యక్షుడు సోమిశెట్టి రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థాపించిన 25ఏళ్ల కాలంలో 7లక్షల 88వేల మంది వినియోగదారులతో, రూ.3248.46 కోట్ల వ్యాపారంతో 66 శాఖలతో మల్టిస్టేట్స్ కో ఆపరేటివ్ బ్యాంకుగా ముందుకు దూసుకెళ్తుందన్నారు. సీఈవో వనమాల శ్రీనివాస్ లాభనష్టాల నివేదికను సమావేశంలో సమర్పించారు. ప్రమాదవశాత్తు మరణించిన గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాదారులైన ఇరువురు సభ్యులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ప్రమాదబీమా చెక్కును అందించారు. సమావేశంలో డైరెక్టర్‌లు మల్లేశం, ప్రసాద్, సాంబమూర్తి, వాసాల శ్రీనివాస్, రాజమురళి, సతీష్, కరుణ, పద్మ, విజయ్, దయాకర్ తదితరులున్నారు.

పద్మశాలి సంఘ భవన నిర్మాణానికి నిధులు ఇవ్వాలి

కొడిమ్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలో తిప్పయ్యపల్లి గ్రామంలో సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం కరీంనగర్‌లో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు గ్రామ పద్మశాలీ సంఘం నాయకులు మండల కాంగ్రెస్ నాయకుడు మ్యాకల మల్లేశంయాదవ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందిచారు. సంఘ భవనం లేక పోవటంతో మాకు సమావేశాలు నిర్వహించుకోవటం ఇబ్బందిగా మారిందని వినతి పత్రంలో పెర్కొన్నారు. మా సంఘ భవన నిర్మాణానికి 5లక్షల రూపాయల నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నిధుల మంజూరుకు కృషి చేస్తానని హమీ ఇచ్చినట్లు పద్మశాలీ సంఘం నాయకులు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో గ్రామ పద్మశాలీ సంఘం నాయకులు లక్ష్మన్, దేవదాసు, గణేష్, భాస్కర్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు ఉన్నారు.

నియామకం

జగిత్యాలరూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా నారెల్లి గంగాధర్, ఉపాధ్య క్షులుగా ఐలవేని లింగన్నలతో పాటుగా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఎన్నికైన నూతన కార్య వర్గాన్ని ప్యాక్స్ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి అభినందించారు.

అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి



కాలువలోని పిచ్చి మొక్కలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కోరుట్ల, ఆగస్టు 16: ప్రజలు అప్రమత్తంగా ఉండి అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు నివారించాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ సూచించారు. కోరుట్ల పట్టణంలోని శనివారం భారీ వర్షాల ప్రభుత్వ సూచనల మేరకు లోతట్టు ప్రాంతాలోని మురికి కాల్వలను శుభ్రం చేసి తాత్కాలిక కాల్వను జేసీబీ సహాయంతో ఏర్పాటు చేశారు. పట్టణంలోని మద్దుల చెరువుకు మత్తడి వద్ద బారిగెట్లను ఏర్పాటు చేసి మత్తడిపైకి ఎవరూ వెల్లవద్దని సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడారు. అత్యవసర సేవల కోరకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హెల్ప్ డెస్క్ కంట్రోల్ కౌంటర్ సెల్ నంబర్ 9100039255, సానిటరీ ఇన్‌స్పెక్టర్ల రాజేంద్రప్రసాద్ 9949565606, ఆశోక్ 9849907961కు సంప్రదించాలని సూచించారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి



మరమ్మతులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందలు లేకుండా అధికారులు వెంటవెంటనే చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని పట్టణ బీఆర్ఎస్ నాయకులు కోరారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆదేశాల మేరకు పట్టణ బీఆర్ఎస్ నాయకులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులను కోరారు. అంగడి బజార్ ప్రాంతంలో ఎలక్ట్రిసిటీ పోల్ కిందపడగా ఏఈ అమరేందర్ దృష్టికి బీఆర్ఎస్ నాయకులు తీసు కెళ్లారు. స్పందించిన ఏఈ మరమ్మతులు చేపట్టి స్థంబాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోయిన్‌పల్లి చంద్రశేఖర రావు నాయకులు ఆకుల ప్రవీణ్, మొరపు తేజ, ఏనుగందుల శ్రీనివాస్, ఒజ్జెల శ్రీనివాస్,లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

-అలరించిన చిన్నారుల వేషధారణలు

-పలు కాలనీల్లో ఉట్టి కొట్టే వేడుకలు

కోరుట్ల, ఆగస్టు 16 : కోరుట్ల పట్టణం గోవిందా... గోపాల నామస్మరణతో మారుమోగింది. శనివారం పట్టణ ప్రజలు శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ వ్యాపారులు వారి వారి దుకాణ సముదాయాల ముందు ఉట్టిలను కట్టి వేడుకలను నిర్వహించంగా వాటిన బీజేపీ, బీజేవైఎం, ఎబివిపి శ్రేణులు కొట్టి వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని శ్రీకృష్ణ, అష్టలక్ష్మి దేవాలయాలలో వేదపండితులు ప్రత్యేక పూజలను నిర్వహించి వేడుకలను నిర్వహించారు. దేవాలయాల అద్వర్యంలో ఉట్టిలను కట్టగా గోపిక కృష్ణని వేశాధారణలో చిన్నారులు నృత్యాలు చేస్తు ఉట్టిలను కోట్టి వేడుకలలో పాల్గొన్నారు. అయా కార్యక్రమాలలో బీజేపీ, బీజేవైఎం, ఎబివిపి నాయకులు పాల్గొన్నారు.

●కోరుట్ల రూరల్: మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలలో గ్రామస్థులు వేడుకలను నిర్వహించారు. గ్రామ ప్రదాన కూడలీలలో గ్రామస్థులు ఉటీని కట్టగా యువకులు వాటిని కోట్టి వేడుకలను జరిపారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాలలోని అంగన్‌వాడి కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలో కృష్ణష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు కృష్ణా గోపికల వేశాధారణలో నృత్యాలు చేయ్యడంతో అకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గోన్నారు.

●మెట్‌పల్లిటౌన్: పట్టణంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ మురళి కృష్ణ దేవాలయంలో, గీత సత్సంగ్ ఆధ్వర్యంలో ఖాదీ హన్‌మాన్ ఆలయలలో, పలు వార్డులలో వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉపేంద్ర పంతులు ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి పుష్పాభిషేకం, అష్టోత్తర శతనామావళి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి 108 రకాల నైవేద్యం సమర్పించారు. శ్రీకృష్ణ, గొల్లభామ వేషధారులతో కోలాటం, ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలు జరిపారు. గీతా సత్సంగ్ అధ్యక్షుడు చీలమంతుల చత్రపతి మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ ఈ లోకానికి భగవద్గీత అర్జునుని నిమిత్త మాత్రంగా చేసుకొని బోధించి అందరిలో అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని అందించారన్నారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని అందులో ఉన్న సారాన్ని గ్రహించాలని కోరారు. అందరూ సుఖంగా శాంతిగా ఉండాలని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పిన బోధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైలారపు లింబాద్రి, మహాజన్ హరీష్, మర్రి భాస్కర్, గాదె రమేష్, పడిగెల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్: రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినీ, విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేశధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాలలో ఉట్టిని కొట్టి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్, పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు రంజిత్, మహేష్, అఫ్సర్, షారు, రజిత, సంజన, ఇందూజ, శ్రీజ, స్రవంతి, మంజుల, మౌనిక, రజిత, మమత, అనూష, సౌజన్య, కవిత, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

●గొల్లపల్లి: గొల్లపల్లి మండలంలో శ్రీకృష్ణా జన్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. కృష్ణాష్టమి పర్వదినంను పురస్కరించుకుని గ్రామాల్లో ఉట్టి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువకులు ఉట్టి కొట్టేందుకు పోటీలు పడగా ఉట్టి వేడుకలను తిలకించేందుకు జనాలు తండోతండాలుగా తరలివచ్చారు. ఉట్టి వేడుకలను జనాలను విశేషంగా అలరించాయి. అనంతరం ఉట్టి పోటీల్లో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులను ప్రధానం చేశారు.

●ఇబ్రహీంపట్నం: కృష్ణాష్టమి పండుగని పురస్కరించుకొని మండలంలోని గోదూర్, తిమ్మాపూర్ యామాపూర్ వేములకుర్తి, మూల రాంపూర్, ఎర్దండీ, ఇబ్రహీంపట్నం తదితర గ్రామాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నా రులను శ్రీకృష్ణుని వేషధారణలో అలంకరించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలం లోని తిమ్మాపూర్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ, గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా 56 రకాల నైవేద్యాలతో స్వామి వారికి నైవేద్యం సమరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్ద మనుషులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు శనివారం కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని అంగడి బజారులో ఉట్టి కొట్టె కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు.

●కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోపిక, కృష్ణుని వేషధారణలతో చిన్నారులు అలరించారు. ప్రధాన కూడళ్ళ వద్ద యువజన సంఘాలు, మహిళా సంఘాల సభ్యులు ఎంతో ఉత్సాహ వాతావరణంలో ఉట్టి కొట్టారు. శ్రీకృష్ణుడు గోపికలతో కలిసి చేసిన అల్లరి అద్యంతం అలరించింది. ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.





కోరుట్లలో ఉట్టి కొడుతున్న బీజేవైఎం, బీజేపీ శ్రేణులు, రాయికల్‌లో వివిధ వేషధారణలో చిన్నారులు

మంత్రి అడ్లూరి పూజలు

ధర్మారం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తిపాక అభయ కృష్ణ ఆలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం గ్రామంలోని అభయ కృష్ణ ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అభిషేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, పత్తిపాక ప్యాక్స్ చైర్మన్ నోముల వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసి అజయ్‌పాల్ రెడ్డి, నర్సింగాపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఏదుల్ల అంజయ్య తదితరులు ఉన్నారు.

'వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సూచించారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావొద్దని, ప్రమాదాలకు గురి కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు కోరారు. శనివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ప్రజలకు పలు సూచనలు చేశారు. 2రోజులపాటు భారీ వర్షాలు కురువనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారని, అందువల్ల ప్రజలు భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం సంబంధిత కార్యాలయాలలో అధికారులను అప్రమత్తం చేసిందని ఏదైనా అత్యవసరం అయితే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అదే విధంగా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయసహకారాలు అందించాలని తెలిపారు.

●భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జగ్రత్తగా ఉండాలని టిపిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు కోరారు. ఆయన శనివారం స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ప్రజలు బయటకు వెళ్లకుండా ఇంట్లోనే జాగ్రత్తగా ఉండాలని,పట్టణంతో పాటు పలు మండలాలు, గ్రామాల ప్రజలు వరద ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్ట్‌లు రహదారులపై నుండి దాటవద్దని, శిధిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండవద్దని, తడిగా ఉన్న కరెంట్ పోల్స్‌ను, ట్రాన్స్‌ఫార్మర్స్ తాకవద్దని, శివారు ప్రాంతాల్లో చేపల వేటకు ఎవరు వెళ్ళొద్దని సూచించారు. కోరారు. అత్యవసరమైతే, ఏదైనా సంఘటన జరిగితే స్థానిక అధికారులకు సమాచారం అందించి సహాయక చర్యలు పొందాలని కోరారు.